క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత భూమిపూజ చేశారు. శనివారం గ్రామస్తులతో కలిసి దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీనర్సింలుగౌడ్, రమేశ్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, నాగభూషణంగౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మోంగ్యానాయక్, మహేందర్‌గౌడ్, సుధాకర్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనం తింటున్న మణికాంత్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు మణికాంత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు రాకపోవడంతో ఉపాధ్యాయుల సమక్షంలో వంటలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సరైన బడ్జెట్‌ను పెట్టకపోవడంతో వంట నిర్వాహకులు ముందుకు రావడంలేదని వాపోయారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చేస్తున్న వంట బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కును అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన నివాసంలో శనివారం పలువురు లబ్ధిదారులకు అందజేశారని తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రంగాయపల్లికి చెందిన భాస్కర్‌చారికి రూ.30 వేలు, కోనాయపల్లి(పీటీ)కి చెందిన శిరిషకు రూ. 36 వేలు, ధర్మరాజ్‌పల్లికి చెందిన ఆంజనేయులకు రూ. 52 వేల విలువైన చెక్కులను అందజేశారన్నారు. వీరి వెంట తూప్రాన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్థికసాయం

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో నిరుపేద కుటుంబీకుల దశదిన కర్మ కోసం లయన్స్ క్లబ్ తరఫున ఆర్థికసాయం అందించారు. వడియారం గ్రామంకు చెందిన స్వామి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉన్నట్లు తెలుసుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు బాధిత కుటుంబీకులకు బియ్యంతో పాటు రూ.3 వేల నగదును అందించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ వినోద్, మండలాధ్యక్షులు సుఖేందర్, లింగమూర్తి, శ్రీనివాస్, వెంకటస్వామి, సంజయులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమికి సర్వే చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రంగాయపల్లి గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ భూమిని సర్వే చేసి, గ్రామ అవసరాలకు ఉపయోగించాలని మండలంలోని రంగాయపల్లి గ్రామ ఉపసర్పంచ్ నవీన్‌చారి రెవెన్యూ అధికారులను కోరారు. శనివారం గ్రామ యువకులతో కలిసి నవీన్‌చారి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భిక్షపతి వినతిపత్రం అందజేశారు. అనంతరం తూప్రాన్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓకు కూడా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, యువకులు సంతోశ్, నాగరాజు, గణేశ్ తదితరులున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

- నత్తనడకన డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు
- నర్సాపూర్‌లో స్లాబ్ దశల్లోనే నిర్మాణాలు
- త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారుల వేడుకోలు



అసంపూర్తిగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు

నర్సాపూర్: పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, ఐదేళ్లు అవుతోంది. అయినా.. ఇంకా ఇళ్లు మాత్రం పూర్తి కాకుండా నిర్మాణ పనులు ఆగుతూ.. కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పట్టణానికి ఐదు వందల డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయగా, 2017లో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కలిసి శంకుస్థాపన చేశారు. నర్సాపూర్‌కు మంజూరైన ఐదు వందల ఇళ్లను రెండు విభాగాలుగా నిర్మిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎదురుగా 252 ఇళ్లను, మార్కెట్ కమిటీకి వెనక భాగంలో 248 ఇళ్లను నిర్మించాలని నిర్ణయించారు.

వివిధ దశల్లో నిర్మాణ పనులు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా నిర్మిస్తున్న 252 డబుల్ బెడ్రూం ఇళ్లకు స్లాబ్, గోడలు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లలో ఫ్లోరింగ్ పనులు చేయాల్సి ఉంది.
- అన్ని ఇళ్లలో కరెంట్ వైరింగ్, కిచెన్ ప్లాట్‌ఫాం తదితర పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. ఈ పనులు ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్నాయి.
- ఫ్లోరింగ్ పనులతో పాటు వైరింగ్ తదితర పనులను బిల్లులు వచ్చిన తర్వాత చేపడుతామని కాంట్రాక్టర్ అంటున్నట్లు సమాచారం తెలిసింది.
- మార్కెట్ కమిటీకి వెనక భాగంలో చేపట్టిన 248 ఇళ్ల పనులు చాలా నత్తనడకన సాగుతున్నాయి. కాగా 178 ఇళ్లకు మాత్రం స్లాబ్ వేశారు.
- వాటిలో కొన్నింటికి గోడల నిర్మాణం పూర్తి చేశారు. కాగా మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు చాలా వెనకపడి ఉన్నాయి. పలు బ్లాక్‌ల భవనాల పనులు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ స్థాయిలో, పలు బ్లాక్‌లు మొదటి అంతస్తు స్థాయిలో ఉండడం గమనార్హం.

గడువు పెంచుతున్న ప్రభుత్వం

- నర్సాపూర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడువు లోగా ఇళ్లు పూర్తి కానందున ప్రభుత్వం మాటిమాటికి నిర్మాణానికి గడువు పెంచుతూనే ఉంది.
- ప్రభుత్వం గడువు పెంచుతున్నా.. సకాలంలో పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి.
- గత ఏడాది నవంబర్ 25న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ డబుల్ బెడ్రూం పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మార్చి నెల వరకు పూర్తి చేయించాలని ఆమె పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డికి ఆదేశించారు. అయినా.. పనులు మాత్రం నత్తనడకలా సాగుతుండడం గమనార్హం. ప్రస్తుతం మొక్కుబడిగా పనులు చేపడుతున్నారు. దీంతో పేద ప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదు. నత్తనడకన సాగుతున్న ఇళ్లను వేగంగా పూర్తి చేయాలని పేద ప్రజలు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేస్తాం



నర్సాపూర్‌లో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నాం. పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. కాంట్రాక్టర్లతో మాట్లాడి, పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రాధికలక్ష్మి, పంచాయతీరాజ్ శాఖ డీఈఈ

పోటీల నిర్వహణ అభినందనీయం



నర్సాపూర్: బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను శనివారం ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు ఆడడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ పోటీల నిర్వాహకులు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు శ్రద్ధగా చదివి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి గ్రామంలో గ్రామానికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న చంద్రశేఖర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరి ఉన్నత శిఖరాలకు చేరాడని అన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్కులు అందించిన అతన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మాచునూరి రాజు యాదవ్, జెడ్పీటీసీ బాబ్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్, గ్రామ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్ గౌడ్, ఎంపీటీసీ సంధ్యారాణి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల భిక్షపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, నాగేశ్, మాజీ ఉపసర్పంచ్ ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక సూర్య నమస్కారాలు



పెద్దశంకరంపేట(మెదక్): సూర్యనమస్కారాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శివ్వంపేట(నర్సాపూర్): ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెద్దశంకరంపేట(మెదక్): రథసప్తమి సందర్భంగా మండల కేంద్రం పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో శనివారం సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీరప్ప, ఉపాధ్యాయులు జైహింద్‌రెడ్డి, శ్రీనివాస్‌లు విద్యార్థులతో సూర్యనమస్కారాలను చేయించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. రోజు సూర్య నమస్కారాలు చేయడంతో విద్యార్థులల్లో ఏకగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో శనివారం సూర్యనమస్కారాలు వేస్తూ.. యోగా ఆసనాలు వేశారు. గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ కాజీపేట రాజేందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో యోగా ఆసనాలు, సూరనమస్కరాలు వేశారు. ప్రతీరోజు యోగా చేయడం ద్వారా విద్యార్థులల్లో ఏకగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని వెల్మకన్నలోని శనేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఇందులో భాగంగా భక్తులతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ కుటుంబ సభ్యులు శనేశ్వరుడికి తైలాభిషేకం చేసి, పూజలు చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. రథసప్తమి సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సాయంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, స్వామి అలంకరణ అర్చకుడు ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవత్సవ్‌శర్మ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా కైలాసగిరి వ్రతం

తూప్రాన్: రథసప్తమి పురస్కరించుకొని పట్టణంలోని గీతా మందిరంలో భక్తులు కై లాస గిరి వ్రతాన్ని శనివారం ఆచరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల పండ్లు, గాజులు, పసుపు, కుంకుమలతో భక్తిశ్రద్ధలతో మంగళగౌరి నోము నిర్వహించి, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉదయ్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరికి ఒకరు పసుపు, బొట్టు ఇచ్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



పూజలు చేస్తున్న మహిళలు

విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నిర్మించిన బగలాముఖీ అమ్మవారి శక్తిపీఠం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని ట్రస్ట్ సభ్యులు పలువురిని ఆహ్వానించారు. శనివారం గుంటూరులోని శ్రీ విశ్వయోగి విశ్వంజీ విశ్వమందిర పీఠాధిపతి స్వామిని దర్శించుకొని, ఆహ్వాన పత్రిక అందజేశారు. వచ్చే నెల 8, 9, 10 తేదిల్లో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారని తప్పక హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ఉపసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు చేయాలని తీర్మానం



మాట్లాడుతున్న సర్పంచ్ మల్లేశ్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్, రంగాయపల్లి గ్రామాల్లో శనివారం అభివృద్ధి పనులు చేయాలని గ్రామ పాలకవర్గ సమావేశాలను నిర్వహించారు. మండలంలోని కాళ్ళకల్ గ్రామంలో సర్పంచ్ మల్లేశ్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశారని కార్యదర్శి శంకర్‌గౌడ్ తెలిపారు. ఇందులో మహిళా భవనం, గ్రంథాలయం, పల్లె దవాఖాన, పశువుల ఆస్పత్రి నిర్మాణం, శ్మశాన వాటిక నిర్వహణ, కాపల కోసం సిబ్బంది ఏర్పాటుకు తీర్మానం చేశారు. రంగాయపల్లిలో సర్పంచ్ నాగభూషణం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, పలు అభివృద్ధి పనులు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉప సర్పంచ్ రాజు యాదవ్, ఉప సర్పంచ్ నవీన్‌చారి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడకు చెందిన రామ్మోహన్ ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, దేవేందర్ శనివారం నియామక పత్రం అందించారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్‌లో ప్రత్యేక పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలుఎ చేశారు.

బ్రహ్మోత్సవాల్లో అన్నదానం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామశివారులోని శ్రీ తిరుమల స్వామి బ్రహ్మోత్సవాల్లో అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా జాతరకు వచ్చే భక్తులకు సుమారు 6 వేల మందికి అన్నదానం చేస్తున్నామని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, మల్లేశం, గాంధే లింగమూర్తి, చెర్విరాల వెంకటేశం, గాంధే రాములు, విఘ్నేశ్వర్ తదితరులు ఉన్నారు.

వెల్దుర్తి బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

రీజినల్ మేనేజర్ సుదర్శన్



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుదర్శన్

వెల్దుర్తి(తూప్రాన్: మండల కేంద్రంలోని బస్‌స్టేషన్‌ను శనివారం రీజినల్ మేనేజర్ సుదర్శన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు మౌలిక వసతులైన మూత్రశాలలు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు సహకరిస్తే వెల్దుర్తి బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నర్సాపూర్ నుంచి వెల్దుర్తి మీదుగా తూప్రాన్, మెదక్ నుంచి వెల్దుర్తికి నైట్‌హాల్ట్ బస్ సర్వీసులు ప్రాంభించాలని, స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో సేవలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఆర్‌ఎం వెంట మెదక్ డిపో మేనేజర్ రవిచందర్, నర్సాపూర్ డిపో ఇన్‌చార్జ్ నరేందర్, కంట్రోలర్ వెంకట్‌గౌడ్ ఉన్నారు.

సెంట్రింగ్ కార్మికులకు ఉచిత బీమా



కంపెనీ బీమా సర్టిఫికెట్ అందిస్తున్న ప్రతినిధులు

కౌడిపల్లి(నర్సాపూర్): సెంట్రింగ్ కార్మికులకు ఎంఎస్ లైఫ్ స్టీల్ కంపెనీ ఉచిత ప్రమాద బీమా చేస్తుందని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని బిజినెస్ మేనేజర్ నరేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం కౌడిపల్లిలో సెంట్రిగ్ కార్మికులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రింగ్ కార్మికులు పనులు చేసేచోట అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుకోని సంఘటనలతో ప్రమాదాలు జరిగితే కుటుంబానికి తీవ్ర నష్టం జరుగుతుందని, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఎంఎస్ లైఫ్ స్టీల్ కంపెనీ సెంట్రింగ్ కార్మికులకు ఉచిత ప్రమాద బీమా చేస్తుందని వివరించారు. కంపెనీ బీమా ఉన్న కార్మికులకు పనిచేసే చోట ప్రమాదం జరిగితే రూ. 30వేలు ఇస్తామని తెలిపారు. వ్యక్తి మరణిస్తే రూ. 2లక్షలు బీమా డబ్బులు నామినీకి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌లైఫ్ స్టీల్ కంపెనీ డీలర్ రాగుల భూమయ్య, కంపెనీ ప్రతినిధులు హరీశ్, మహేశ్, దివారకర్, సివిల్ ఇంజనీర్లు సలావుద్దీన్, సుమన్ శర్మ కార్మికులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో రైతులకు మేలు

- ఏడీఏ రాం ప్రసాద్
- ఎక్లాస్‌పూర్‌లో వరి పరిశీలన



వరిని పరిశీలిస్తున్న ఏడీఏ రాం ప్రసాద్

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తే ఎంతో మేలు జరుగుతుందని పెద్దశంకరంపేట ఏడీఏ రాం ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో డ్రమ్ సీడర్‌తో వేసిన వరి క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తన ఖర్చు తగ్గుతుందని, విత్తిన రెండు రోజుల లోపు కలుపు మందు పిచికారీ చేసుకోన్నట్లయితే ప్రధానంగా కలుపు నివారించుకోవచ్చునని తెలిపారు. కూలీల సమస్యను అధిగమించవచ్చునని, సరైన సమయంలో పంటను విత్తు కోవచ్చునని చెప్పారు. ఈ పద్ధతిలో సాగు వారం, పది రోజుల ముందుగానే పంట కోతకు వస్తుందన్నారు. ఇందులో ఏఈఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆరోగ్యలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలి



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న ఆరోగ్యలక్ష్మిని సద్వినియోగం చేసుకోవాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ స్రవంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల ఎత్తు, బరువు చూశామన్నారు. బాల్య వివాహాలు నేరమని, హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181 గురించి వివరించారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు పౌష్టిక ఆహారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

‘మైనార్టీ రుణాల సంఖ్య పెంచాలి’

పాపన్నపేట(మెదక్): మండలానికి మంజూరైన మైనార్టీ రుణాల సంఖ్య పెంచాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో అతిపెద్ద మండలం పాపన్నపేట అని అన్నారు. కానీ జనాభాకనుగుణంగా కాకుండా మండలానికి కేవలం నాలుగు మైనార్టీ రుణాల యూనిట్‌లు మంజూరు చేయడం సరికాదన్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకొని, కనీసం 40 యూనిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీ యువతీ యువకుల ఆందోళనకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు.

కరెంట్ బిల్లులపై ఏసీడీ రద్దు చేయాలి

పాపన్నపేట (మెదక్): విద్యుత్ వినియోగదారుల కరెంట్ బిల్లుపై ఏసీడీని వెంటనే రద్దు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కరెంట్ బిల్లులపై అదనపు విద్యుత్ వినియోగం(ఏసీడీ)ని విధించడం ఘోరమన్నారు. విద్యుత్ కంపెనీలు నష్టాల్లో ఉన్నందున, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో మోటార్లు పాడైపోయి నష్టం రావడంతో అడ్డదారిన కరెంట్ బిల్లులో ఏసీడీ పేరుతో వినియోగదారులపై అధికభారం మోపుతున్నారని, పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, లేని పక్షంలో రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

కాండం తొలిచే పురుగు నివారణకు చర్యలు



కౌడిపల్లి(నర్సాపూర్): పాడైపోతున్న వరి పైరును పరిశీలిస్తున్న జేడీఏ ఆశకుమారి

కౌడిపల్లి(నర్సాపూర్): వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకొని నివారించుకోవాలని జేడీఏ ఆశకుమారి తెలిపారు. శనివారం మండల పరిధిలోని తునికి, రాయిలాపూర్, పాంపల్లి గ్రామాల్లో పలువురు రైతులు వరి పంటలను జేడీఏ పరిశీలించారు. కాగా కాండం తొలుచుపురుగు ఆశిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ నెలలో సాగుచేసిన వరి పైరుకు అధికంగా కాండం తొలుచుపురుగు ఆశిస్తుందని తెలిపారు. నివారణ కోసం రైతులు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరాకు 8కిలోలు వేయాలని, పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోరాంత్రా నిలిప్రోల్ గుళికలు ఎకరాకు 4కిలోలు వేసుకోవాలని వివరించారు. పంటలో జింక్ లోపం సైతం ఉందని నివారణకుగాను చిలామిన్ జింక్ ఎకారకు 250గ్రాములు వారంలో రెండుసార్లు స్ప్రే చేయాలని తెలిపారు. రైతులు మోతాదుకు మించి రసాయర ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొద్దన్నారు. దీంతో రైతులకు ఆర్థికంగా నష్టం జరగడంతోపాటు పంట, నేల, నీరు కలుషితం అవుతాయని చెప్పారు. రైతులు ప్రతీరోజు పంటను గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, ఏఓ స్వప్న, ఏఈఓలు రాజశేఖర్‌గౌడ్, దివ్యశ్రీ, రైతులు శ్రీను,సత్యనారాయణ పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): పొలాల్లో అవసరమైన మేరకు మాత్రమే రసాయన మందులను వాడాలని ఏఓ రాజశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో ఏఈఓ సచిన్, రైతులు పాల్గొన్నారు.